పాడి పశువులకు కాల్షియం లోపం!

- ఆవు పాలలో తగ్గిన ఎల్‌ఆర్, ఎన్‌ఎస్‌ఎఫ్
- పాల ధరలపై ప్రభావం
- పశుగ్రాసానికి ఎక్కువగా యూరియా వాడకమే కారణం
- పట్టు పరుగుల గూళ్లపైనా ప్రతికూల ప్రభావమే!

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలో ఎక్కువ మంది రైతులకు పాడి పరిశ్రమే జీవనాధారం. భూమిలేని పేదలు సైతం పాడి ఆవుల పోషణపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నారు. అయితే ఈ మధ్యకాలంలో పాడి పశువుల్లో ఎక్కువగా కాల్షియం లోపం కనిపిస్తోంది. దీంతోపాటు పాల డిగ్రీ (ఎల్‌ఆర్) పాల ధరలు తక్కువగా వస్తున్నాయి. దీనిపై వెటర్నరీ అధికారులను సంప్రదిస్తే పాడి పశువులకు వేస్తున్న పశుగ్రాసంలో ఎక్కువగా యూరియా శాతం పెరిగిందనే చేదు నిజం బయటపడింది. విచ్చలవిడిగా పశుగ్రాసాలకు యూరియా వాడడంతోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని వ్యవసాయశాఖ హెచ్చరిస్తోంది.

పశుగ్రాసం త్వరగా పెరగాలని..

పశుగ్రాసం పెరిగేందుకు మిశ్రమ ఎరువుల తోపాటు సేంద్రియ పద్ధతులను పాటించాలి. కానీ వీటితో పంట త్వరగా పెరగదు. అదే తక్కువ ధరతో లభించే యూరియా చల్లితే పంట ఏపుగా పెరుగుతుంది. దీంతో రైతులు ఇష్టానుసారంగా పశుగ్రాసం సాగుకు యూరియా వాడుతున్నారు. పంటల సాగులో సూక్ష్మ పోషకాల ప్రాముఖ్యత ఎంతగానో ముఖ్యం. అయితే సూక్ష్మ పోషకాలు ఏమేర లోపించాయి? భూసార పరీక్షల ఫలితాలేంటి? వాటికి అవసరమైన పోషకాల శాతం ఏమిటనేది రైతులు అసలు పట్టించుకోవడం లేదు. దీంతో మేలు కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు.



యూరియా వాడకంతో ఏపుగా పెరిగిన పశుగ్రాసం

పట్టుగూళ్లలో నాణ్యత లోపం

ఈ ప్రాంతంలో పట్టురైతులు పదివేల మంది వరకూ ఉన్నారు. 12వేల హెక్టార్లలో మల్బరీ సాగులో ఉంది. దీనికి సైతం ఆకులు త్వరగా రావాలని ఈ మధ్య యూరియాను ఎక్కువగా వాడుతున్నారు. ఈ ఆకును తిన్న పట్టుపరుగులు నాణ్యమైన పట్టును ఉత్పత్తి చేయడం లేదు. దీంతో మార్కెట్‌లో పట్టుగూళ్ల ధర తక్కువ పలుకుతోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించే దిశగా చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పాడి రైతులకు తప్పని కష్టాలు

నియోజకవర్గంలో లక్ష వరకూ పాడి పశువులున్నాయి. 40వేల మంది పాడి రైతులున్నారు. ఇక్కడ పది పాల డెయిరీలున్నాయి. రోజూ 24వేల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. అయితే యూరియా ఎరువుతో పండిన పశుగ్రాసాన్ని తిన్న పాడి ఆవుల్లో ప్రధానంగా కాల్షియం లోపం కనిపిస్తోంది. దీంతో ఆవులు ఈనడంలోనూ సమస్యలు తప్పడం లేదు. ముఖ్యంగా పాలధరల తగ్గుముఖానికి ఇది కారణమైంది. సాధారణంగా ఆవుపాలు ఎల్‌ఆర్(లాక్టోమీటర్ రీడింగ్) 26 నుంచి 28 శాతంగా ఉండాలి. కానీ యూరియా మేత తిన్న పశువుల పాల డిగ్రీ 26 కంటే తక్కువగా వస్తోంది. ఇక ఎస్‌ఎన్‌ఎఫ్(సాలిడ్స్ నాట్ ఫ్యాట్) పోషక విలువల శాతం 8.5%గా ఉండాలి. కానీ ఇది 8 కంటే తక్కువకు పడిపోయింది. ఈ కారణంగా పాల ధరల్లో లీటర్‌కు రూ.5 నుంచి రూ.8 దాకా వ్యత్యాసం వస్తోంది. ఫలితంగా పాడి పశువుల పోషణ రైతులకు భారంగా మారుతోంది.

అవగాహన లేక అనర్థాలు

“కొందరు రైతులు అవగాహన లేక పశుగ్రాసం, మల్బరీ సాగుకు విపరీతంగా యూరియాను వాడుతున్నారు. దీని వల్ల వాటి పశువుల పాలు డిగ్రీకి రాదు. ఈ పాలను తాగితే కాలక్రమంలో ఆరోగ్య సమస్యలూ తప్పవు. నా స్నేహితుడు ఒకాయన నెలకు పదిబస్తాల యూరియాను కొని పశుగ్రాసానికి వేస్తున్నాడు. వాటిని తినే పశువులు గతి ఆ పాలను తాగే వాళ్ల పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోండి.

–సుబ్రమణ్యం రెడ్డి, ఆదర్శ రైతు, కల్లాడు

మేం చెబుతూనే ఉన్నాం

ఇటీవల రైతులు ఇష్టానుసారంగా యూరియా వాడుతున్నారు. దీంతో మొక్క ఏపుగా పెరగడం తప్పితే పెద్దగా లాభముండదు. భూమి కలుషితమై సారాన్ని కోల్పోయి పనికి రాకుండా పోతుంది. మరోవైపు పశుగ్రాసానికి, మల్బరీ సాగుకు సైతం విపరీతంగా యూరియా వాడుతున్నారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను వాడాలని మేం చెబుతూనే ఉన్నాం.

–సంధ్య, ఏఓ, పలమనేరు

క్లుప్తంగా

సచివాలయం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గంగవరం: మండలంలోని గండ్రాజుపల్లి గ్రామ సచివాలయాన్ని ఉమ్మడి చిత్తూరు జిల్లా చైర్మన్ శ్రీనివాసులు శనివారం తనిఖీ చేశారు. ఉల్లికుంట గ్రామంలో ఓ వివాహ కార్యక్రమానికి హాజరైన ఆయన తిరుగు ప్రయాణంలో గండ్రాజుపల్లి సచివాలయాన్ని తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి పింఛన్ల పంపిణీ, పీ4 సర్వే గురించి సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సర్పంచ్ మల్లికార్జున, నేత చలపతిరెడ్డి ఉన్నారు.

రైతులకు అందుబాటులో కవర్లు



బస్తాలలో మామిడి కవర్లు

గంగవరం: ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మామిడి పండ్ల కవర్లు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 50శాతం రాయితీతో రూ.1కే మామిడి పండ్ల కవర్లు రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. కవర్లు కావాల్సిన రైతులు ముందుగా రైతు సేవా కేంద్రాల్లో ఆధార్, పాస్ బుక్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లు సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

సబ్సిడీపై కవర్లు

పెద్దపంజాణి: ఉద్యాన శాఖ ద్వారా 50 శాతం రాయితీతో రూ.1కే మామిడి పండ్ల కవరు ఇస్తున్నట్లు పుంగనూరు ఉద్యానశాఖ అధికారి వరప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కవర్లు కావాల్సిన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకుని కవర్లు పొందవచ్చని పేర్కొన్నారు. ఎకరాకు 4 వేల కవర్లు, గరిష్టంగా హెక్టారుకు 10 వేల కవర్లు ఇస్తామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే!

పలమనేరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి శనివారం ఉత్తర్వులు అందాయి. ఆమేరకు అధ్యక్షులుగా యూత్‌వింగ్‌కు చంద్రారెడ్డి, మహిళా విభాగానికి కవిత, రైతు విభాగానికి రమణారెడ్డి, బీసీ సెల్‌కు భూపతి, ఎస్సీ సెల్‌కు అనిల్‌కుమార్, ఎస్టీ సెల్‌కు ఆనందప్ప, మైనారిటీ సెల్‌కు అక్బర్, స్టూడెంట్ వింగ్‌కు మహేష్, పీఆర్ వింగ్‌కు రమేష్‌రెడ్డి, మున్సిపల్ వింగ్‌కు షరీఫ్, ఆర్టీఐకి సుబ్రమణ్యం, వలంటీర్స్ వింగ్‌కు కృష్ణ, గ్రీవెన్స్‌సెల్‌కు మనోజ్‌రెడ్డి, వాణిజ్య విభాగానికి బాలాజీ, వీవర్స్‌కు లక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీకి మంజునాథ్, లీగల్ సెల్‌కు సోమశేఖర్‌రెడ్డి, కల్చరల్‌కు బాలాజీ, సోషల్ మీడియాకు ఉదయ్, ఐటీ వింగ్‌కు బద్రి, డాక్టర్స్ వింగ్ బాలాజీ రెడ్డి, బూత్ కమిటీలకు జగదీశ్వర్, పబ్లిసిటీ వింగ్‌కు రాధాకృష్ణలను నియమించినట్టు ఆ ఆదేశాల్లో తెలిపారు.

విద్యార్థుల గణిత ప్రజ్ఞాధారణ

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గణిత ప్రజ్ఞాధారణ కార్యక్రమంలో ప్రతిభ చాటారు. పాఠశాల ఆవరణలో శనివారం గణిత ప్రజ్ఞాధారణ నిర్వహించారు. పాఠశాలకు చెందిన లహరి, పునీత్‌సాయి కళ్లకు గంతలు కట్టుకుని పై విలువను రెండు వేల దశాంశ స్థానాలను చెప్పి అలరించారు. కార్యక్రమానికి విచ్చేసిన గుండ్లకట్టమంచి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బేరినాథ్ మాట్లాడుతూ, ఇద్దరు విద్యార్థులు 2 వేల దశాంశ స్థానాలు చెప్పడం గొప్ప విషయమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు: అడవినాథునికుంటలోని ఆదర్శ ప్రభుత్వ పాఠశాలలో వచ్చే విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ టీఎస్.రమ తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఓసీ, బీసీ, ఈబ్ల్యూఎస్ వారికి రూ.150, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ వర్గాల వారికి రూ.75 రుసుము చెల్లించాలన్నారు. ఈనెల 31వ తేదీ గడువు ఉందని, విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రవేశపరీక్ష ఆధారంగా, రిజర్వేషన్ నిబంధనల ప్రకారం సీట్లు కేటాయిస్తామని చెప్పారు. ఏప్రిల్ 20న స్థానిక ఆదర్శ పాఠశాలలో ఉదయం 10 నుంచి 12 వరకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు.

హక్కులను కాపాడుకుంటాం

పుంగనూరు: సమాజంలో మాదిగల హక్కులను ఎవరూ హరించకుండా కాపాడుకుంటామని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్వర్గీయ మిద్దింటి వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు నరసింహులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆశయాలను కాపాడుతామని స్పష్టం చేశారు. నాగభూషణం, ప్రభాకర్, వెంకట్రమణ, టి.నరసింహులు, తేజ్‌కుమార్, సదాశివ, ఆనంద, శివశంకర, గంగప్ప, వెంకటేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

8న మహిళా సదస్సు

పలమనేరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈనెల 8న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి, జాయినింగ్ ద డాట్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక కళామందిరంలో మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తులసీనాథంనాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన 25 మంది మహిళా మణులకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు.

నరువి ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

వేలూరు: మానవుని గుండెను తాత్కాలికంగా నిలిపివేసి మొదడులోని నరాలకు అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు వేలూరులోని నరువి ఆస్పత్రి చైర్మన్ జీవీ సంపత్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లా కుప్పంలోని నారాయణశాస్త్రి వీధికి చెందిన మురళి(55)కి గత నెలలో జరిగిన ఓ ప్రమాదంలో మొదడులోని నరాలు తెగి పోవడంతో పాటు రక్తప్రసరణ ఆగిపోయినట్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కుప్పంలోని ఆస్పత్రిలో చికిత్స చేసినప్పటికీ నయం కాకపోవడంతో వేలూరులోని నరువి ఆస్పత్రికి వచ్చారన్నారు. అనంతరం వైద్యులు శస్త్ర చికిత్స చేసేందుకు ముందుకు వచ్చారన్నారు. ఎనిమిది గంటల పాటు శస్త్ర చికిత్స కోసం మెదడుకు రక్తం వెలువడకుండా గుండెను తాత్కాలికంగా నిలిపి వేసి యంత్రం ద్వారా గుండె కొట్టుకునే విధంగా ఏర్పాటు చేసి రక్తం మెదడుకు వెళ్లకుండా చేశారు. మెదడులోని నరాలకు శస్త్ర చికిత్స చేసిన అనంతరం గుండెను యథావిధిగా కొట్టుకునే విధంగా చేశారు. ఇటువంటి శస్త్ర చికిత్స దేశంలోనే మొట్ట మొదటిసారిగా తమ ఆస్పత్రిలో చేసి సాధన చేసినట్లు తెలిపారు. అనంతరం శస్త్ర చికిత్స చేసి సాధన చేసిన వైద్యులను ఆస్పత్రి చైర్మన్ అభినందించారు. ఆయనతో పాటు ఆస్పత్రి వైద్యులు, రోగి మురళి కుటుంబ సభ్యులున్నారు.



శస్త్ర చికిత్స చేసుకున్న మురళికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆస్పత్రి చైర్మన్ సంపత్

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

శాంతిపురం: సోగడబల్ల వద్ద ఉన్న గురుమూర్తి ఎల్లమాంబ ఆలయ 31వ వార్షికోత్సవం ఘనంగా సాగుతోంది. ఉత్సవాల్లో రెండవ రోజైన శనివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, మంగళహారతి నిర్వహించారు. ఎమ్మెల్సీ భరత్ తరపున ధర్మకర్తలు నాగమ్మ, చంగప్ప అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా పచ్చిగరిగె, అగ్నిగుండం, బాణ వేడుకలు, అన్నదానం, పౌరాణిక నాటక ప్రదర్శనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్న భక్తులకు ధర్మకర్తలు భోజన వసతిని కల్పించారు. ఆదివారం అమ్మవారికి పొంగళ్ల సమర్పణతో మూడు రోజుల వార్షికోత్సవాలు ముగియనున్నాయి.



విశేష అలంకరణలో ఎల్లమాంబ

కొనసాగుతున్న రైతుల నిరసన

కుప్పంరూరల్: కుప్పం మండలం, ఆవులనత్తం వద్ద ఏర్పాటు చేసిన జెల్లి ఫ్యాక్టరీ వల్ల తమ బతుకులు ఛిద్రమవుతున్నాయని, 55 రోజులుగా నిరసన దీక్షలు చేపడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానిక రైతులు శనివారం ఆవేదన చెందుతున్నారు. కాలం కూడా మారిందని, శివరాత్రితో చలికాలం పోయి ఎండా కాలం వచ్చినా మా బతుకుల్లో మార్పు రాలేదన్నారు. సుదీర్ఘంగా 55 రోజుల పాటు నిరసన దీక్షలు చేపడుతున్నా పట్టించుకున్న నాథుడే లేకపోయాడని ఆవేదన చెందుతున్నారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే రైతులు, సామాన్య జనం పరిస్థితి ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. తమ న్యాయమైన కోర్కెలు ఫ్యాక్టరీ వల్ల పొలాల్లో పంటలు రావడం లేదని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని, దుమ్మువల్ల శ్వాస కోశ వ్యాధులు వస్తున్నాయని, రోడ్డెక్కి నిరసన చేస్తుంటే ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. న్యాయం జరిగే వరకు నిరసన దీక్షలు ఆపేది లేదని తేల్చి చెబుతున్నారు.



ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

బ్రహ్మోత్సవాల పోస్టర్లు విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

పుంగనూరు: పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 6 నుంచి ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం ఆలయ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో పోస్టర్లు, కరపత్రాలు విడుదల చేశారు. మునీంద్రబాబు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను 11 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో జరిగే బ్రహ్మోత్సవాలు ప్రతిరోజూ వేకువజామున ప్రారంభించి రాత్రి వాహనసేవలతో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు విరాళాలు అందించే దాతలు ఆలయంలో చెల్లించి, రశీదు పొందాలని కోరారు.

పాముకాటుతో అస్వస్థతకు గురైన వృద్ధుడు

పుంగనూరు: మండలంలోని కొత్తపల్లెకు చెందిన లింగప్ప(80) శుక్రవారం రాత్రి పాము కాటుకు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు లింగప్పను హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. లింగప్ప చికిత్స పొందుతున్నాడని తెలిపారు.

వారి త్యాగాలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న నేతలు

రొంపిచెర్ల: మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేవని విద్యావేత్త డాక్టర్ రఘునాథ్ అన్నారు. ఆయన శనివారం రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అమరవీరులకు నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల ఎంఆర్‌పీఎస్ ఉద్యమంలో అసువులు బాసిన నాగేశ్వరరావు మస్తాన్, తెల్లబండ్ల రవి, సురేందర్, దామోదర్, మహేష్, భారతి మాదిగల కోసం ప్రాణాలు వదిలారని గుర్తు చేశారు. ఉద్యమాల్లో ప్రాణాలు కోల్పోయిన మాదిగల కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేతలు గిరిబాబు, రవి, గిరి, చరణ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా మొదలైన ఇంటర్ పరీక్షలు

పలమనేరు: పట్టణంలో శనివారం ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా మొదలయ్యాయి. తొలి పరీక్షగా తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం, ఒకేషనల్ కోర్సుల్లో జీఎఫ్‌సీ(జనరల్ ఫండమెంటల్ కోర్సు) పరీక్షలు జరిగాయి. పట్టణంలోని ఏడు కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షలకు 3,275 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 152 మంది గైర్హాజరైనట్టు ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ పరీక్షలకు కస్టోడియన్లుగా సుబ్రమణ్యం, రెడ్డెప్ప వ్యవహరించారు.

కుప్పంలో..

కుప్పం: ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల విద్యార్థులు మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష రాసేందుకు తరలివచ్చారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగింది.

45 మంది గైర్హాజరు

పుంగనూరు: పట్టణంలో ఇంటర్ పరీక్షలు శనివారం అత్యంత కట్టుదిట్టంగా ప్రారంభమయ్యాయి. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పట్టణంలోని రెండు కేంద్రాల్లో 738 మంది పరీక్షలు రాశారు. 45 మంది పరీక్షలకు హాజరుకాలేదు.



పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థులు

ఇంటర్ పరీక్షకు 25 మంది గైర్హాజరు

నదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభం అయ్యాయి. తెలుగు పరీక్షకు 268 మంది విద్యార్థులకుగాను 243 మంది హాజరయ్యారని ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ వెంకటనాథరెడ్డి తెలిపారు. 25 మంది గైర్హాజరు అయినట్లు ఆయన చెప్పారు.

దాసార్లపల్లికి బస్సు వచ్చేసిందోచ్!

- పదేళ్లుగా పోరాడిన పది గ్రామాల ప్రజలు
- డయల్ యువర్ డీఎంలోనూ వినతులు
- సాక్షి చొరవతో పరిష్కారమైన ఎర్రబస్సు సమస్య

పలమనేరు: పది గ్రామాల ప్రజలు ఎర్రబస్సు కోసం దశాబ్దాలుగా ఆర్టీసీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. వారు పట్టించుకోకపోవడంతో ఆర్టీసీ ఉన్నతాధికారులకు వినతులు పంపారు. అంతేకాదు స్థానికంగా ఏ పార్టీ ఎమ్మెల్యేలున్నా తమ సమస్యను పరిష్కరించాలంటూ ఎన్నో ఏళ్లుగా వేడుకుంటూనే ఉన్నా ఎవరూ కనికరించ లేదు. పలమనేరు నుంచి దాసార్లపల్లి ఆర్డినరీ బస్సును నడపాలని ఇటీవల జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలోనూ పది గ్రామాల ప్రజలు విన్నవించారు. ఈ సమస్యపై గత నెల 15న సాక్షి దినపత్రికలో '10 ఊళ్ల జనం 10 ఏళ్ల రణం' పేరిట కథనం వెలువడింది. దీనిపై స్పందించిన స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, డీఎం టీకే స్వామి, డీపీటీఓ జగదీష్ స్పందించి శనివారం నుంచి దాసార్లపల్లికి ఎర్రబస్సును నడిపారు.

సాక్షి ఎఫెక్ట్..

బస్సు ఎలా వెళుతుందంటే...

పలమనేరు నుంచి రోజూ ఉదయం 6 గంటలకు బయలుదేరి 7 గంటలకు దాసార్లపల్లికి చేరుకుంటుంది. ఆపై లక్కనపల్లి మీదుగా 8.30కు పలమనేరుకు వస్తుంది. మళ్లీ తీర్థం మీదుగా వెళ్లి పలమనేరుకు 11 గంటలకు వస్తుంది. మళ్లీ దాసార్లపల్లి నుంచి చిత్తూరుకు 3.30కి చేరుకుంటుంది. అక్కడి నుంచి బయలుదేరి పలమనేరుకు 4.40కి వచ్చి సాయంత్రం 6 గంటలకు దాసార్లపల్లికి చేరుకొని రాత్రి 7 గంటలకు డిపోకు వెళ్తుంది. ఈ టైమింగ్స్‌తో శనివారం మొదటి రోజు బస్సు ఈ మార్గంలో నడిచింది.



దాసార్లపల్లికి నడిచిన పల్లె వెలుగు బస్సు

ఆనందం వ్యక్తం చేస్తున్న పది గ్రామాల ప్రజలు..

సాక్షి చొరవతో తమ గ్రామాలకు బస్సు సౌకర్యం ఇన్నేళ్లకు కలిగిందని కర్ణాటక రాష్ట్ర సరిహద్దుల్లోని మారుమూల గ్రామాలు ఒకింత ఆశ్చర్యానికి గురై మనసులో ఆనందపడినట్టు తెలిసింది. దాసార్లపల్లి గ్రామం కర్ణాటక రాష్ట్ర సరిహద్దుగా ఓ అడుగు పక్కన పెడితే కర్ణాటకలోని బైప్పళ్లి వస్తుంది. రాష్ట్ర సరిహద్దులోని ఈ గ్రామానికి బస్సు గతంలో నడిచేది. కొన్నేళ్ల క్రితం ఈపీకే(ఎర్నింగ్ ఫర్ కిలోమీటర్) తగ్గిందని సర్వీసును ఆపేశారు. ఎట్టకేలకు ఎర్ర బస్సు రావడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు కారణమైన సాక్షి దినపత్రిక, స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ అధికారులకు వారు కృతజ్ఞతలను తెలిపారు. ఇక తమకు ఆటోల బాధ తప్పిందని అయితే టైమింగ్ కాస్త మార్చేందుకు డీఎంను కలిసి ఆపై తమ గ్రామాల్లో బస్సుకు పూజలు చేసి పండుగలా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని పలు గ్రామాల ప్రజలు తెలిపారు.

తమలపాకులా మజాకా!

- కట్ట తమలపాకులు రూ.170కి పైనే
- క్రమేనా తగ్గుతున్న ఆకుతోటల సాగు
- కర్ణాటక నుంచి దిగుమతి
- అంతరిస్తున్న వారపుసంతల సంస్కృతి

పలమనేరు: మనిషి దైనందిన జీవితంలో తమలపాకులకు ఓ ప్రత్యేక స్థానముంది. ఆలయాల్లో పూజల నుంచి ఏ శుభకార్యం జరిగినా తమలపాకులు ఉండాల్సిందే. ఇక తాంబూలాల ప్రియులకు రోజూ ఎర్రటి నోటి కోసం తమలపాకు ఉండాల్సిందే. అయితే మంచు కారణంగా తోటల్లో ఈ తమలపాకులకు ఇప్పుడు భలే డిమాండ్ వచ్చి పడింది. దీంతో తమలపాకు ధరలకు రెక్కలొచ్చాయి. కట్ట తమలపాకులు(వంద ఆకులు) ధర రూ.170కి పైమాటే. దీంతో సామాన్యులు తమలపాకుల ధరతో బెంబేళెత్తుతున్నారు. ఈనెల చివరి దాకా తమలపాకు తోటల్లో తీగెలు దించే కాలం కాబట్టి డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. ఏదేమైనా ఇలాంటి అధిక ధరల్లో తాంబూలం వేసినట్టేని తాంబూల ప్రియులకు ఆందోళన తప్పడం లేదు.

తగ్గిన తమలపాకు సాగు..

జిల్లాలోని పడమటి ప్రాంతంలో తాంబూలం వేసే గ్రామీణుల సంఖ్య ఎక్కువగా ఉంది. ముఖ్యంగా పలమనేరు, కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో చాలామందికి తాంబూలం వేయడం ఇప్పటికీ అలవాటు. దీంతో పాటు అన్ని శుభకార్యాలకు, ఆలయాల్లో పూజలకు కచ్చితంగా తమలపాకులు ఉండాల్సిందే. ఈ ప్రాంతంలో గతంలో 600 దాకా తమలపాకు తోటలుండేవి. కాలక్రమేనా వీటి సాగు తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం తమలపాకు తోటలు పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో శాంతిపురం, కుప్పం వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు మండలాల్లో వందలోపునకు పడిపోయాయి. ఒక్కసారి తమలపాకు తోటను సాగుచేస్తే ముప్పై ఏళ్లపాటు సాగు చేసేవారు. అయితే వీటి నిర్వహణకు ప్రత్యేకంగా మనుషులుండాల్సిందే. పాతతరం నాటి వాళ్లు ఉన్నప్పుడు వీటిని సాగుచేసేవారు. నేటి తరంలో వీటిపై పెద్దగా ఆసక్తి తగ్గింది. ఉన్నతోటల్లోనూ ఈ సీజన్‌లో తీగెలను దించే సమయం ఇది. దీంతో డిమాండ్‌కు సరిపడా ఆకు తోట సాగు లేదు.



పలమనేరు మండలంలోని తమలపాకు తోట (ఫైల్)

కర్ణాటక నుంచి తమలపాకులు..

కర్ణాటకలోని తుంకూరు ప్రాంతం నుంచి ఇక్కడికి తమలపాకులు ఎక్కువగా వస్తున్నాయి. అయితే ఇవి లోకల్ తోటల్లోని నాటు రకాలు కావు. కాస్త హైబ్రిడ్‌గా పండించే తమలపాకులను తుంకూరు జిల్లా రైతులు పండిస్తుంటారు. స్థానికంగా సరుకు లేనందువల్ల అక్కడి నుంచి వస్తున్న ఆకులకు డిమాండ్ ఏర్పడింది. ఫలితంగా తమలపాకు ధర ఆకాశాన్నంటుతోంది.



పలమనేరు ప్రాంతంలోని తమలపాకులు

కనుమరుగవుతున్న వారపుసంతలు..

జిల్లాలోని వందచోట్ల గతంలో వారపుసంతలు జరిగేవి. కాలక్రమేనా సంతల ఉనికి లేకుండాపోయాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో శాంతిపురం సమీపంలోని బొడుమాకులపల్లి, వి.కోట, పలమనేరు, పుంగనూరు, కర్ణాటకలోని ముళబాగల్ తాలుకాలో వారపు సంతలు నడుస్తున్నాయి. మిగిలిన చోట్ల సంతలు జరగడం లేదు. వారానికోసారి నిర్వహించే సంతలకు స్థానిక వ్యాపారులే కాకుండా కర్ణాటక, తమిళనాడుల నుంచి పెద్దసంఖ్యలో వచ్చి దుకాణాలను నిర్వహించేవారు. దీంతో సరసమైన ధరలకే వస్తువులు లభించేవి. సంతలు తగ్గడంతో మండల కేంద్రాలు, పట్టణాల్లో వ్యాపారులు రింగుగా ఏర్పడి ఏ దుకాణానికి వెళ్లినా ధరలు ఒకేలా ఉండేలా చేశారు. దీంతో వారు చెప్పినంత ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొంది.

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

పెద్దపంజాణి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పెద్దపంజాణి–పుంగనూరు మండల సరిహద్దులోని శ్రీప్రసన్న పార్వతీదేవి సమేత అగస్తీశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 21వ తేదీ నుంచి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా శనివారం దోపోత్సవం, తిరునాళ్లను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వీరికి తుర్లపల్లి పరిసర గ్రామాలకు చెందిన దాతలు అన్నదానం చేశారు.